

మంత్రాలయం ఎమ్మెల్యే శ్రీ వై.బాలనాగిరెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఇరవై యేళ్లలో జరగాల్సిన అభివృద్ధి, సంక్షేమాన్ని సీఎం వైఎస్ జగనన్న నాలుగేళ్ల పాలనలో అందించదన్నారు. శనివారం పట్టణం లోని 33, 36, 37, 38 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 37వ వార్డు రాయనగర్‌లో విజయ్ జిన్నింగ్ ఫ్యాక్టరీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ బోయశాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వలీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు. భీరప్పనగర్‌లో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ బోయ శాంత, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్, ఎంఈ, టీపీఓ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయనగర్, పైకొట్టాల, దేవినగర్ ప్రాంతాల్లో వీధివీధిన సీసీ రోడ్లు, మురుగు కాలువలు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేశామన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. వార్డులో 3,732 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు. 36, 37 వార్డుల్లో 4,560 దరఖాస్తులు రాగా, అందులో 4,256 సమస్యలను పరిష్కరించామని చెప్పారు. కొత్తగా 12 మందికి రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.



రాజీ మార్గమే..రాజ మార్గం



మాట్లాడుతున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్ : పట్టణంలోని జిల్లా కోర్టులో అదనపు జిల్లా జడ్జి ఆధ్వర్యంలో శనివారం జాతీయ స్పెషల్ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి రాజీమార్గమే రాజమార్గమని చెప్పారు. వివిధ రకాల రోడ్డు ప్రమాదాలు (వాహనాల యాక్సిడెంట్) కేసులు, ప్రభుత్వ భూసేకరణ కింద సేకరించిన వివిధ రకాల కేసుల పరిష్కారానికి నోచుకున్నాయన్నారు.

25న విద్యాసంస్థల బంద్

ఆదోని సెంట్రల్: ఈ నెల 25వ తేదీన విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి యస్. షాబీర్ బాషా, టీఎన్ఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు బెస్త సూర్య, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, ఏఐఎస్ఏ డివిజన్ ప్రధాన కార్యదర్శి అనిల్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్ట్‌అండ్‌సైన్స్ కళాశాలలో విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు.

ఆర్థిక సాయం

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం పంచాయతీ బాపురం మజరా గ్రామానికి చెందిన పద్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆమె అంత్యక్రియల కోసం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు హనుమంతరెడ్డి, చిన్న వీరేష్ లతో రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఆటో బోల్తా ముగ్గురు విద్యార్థులకు గాయాలు

కోసిగి: స్థానిక రైల్వే గేటు వద్దనున్న పెట్రోల్ బంక్ సమీపంలో ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. శనివారం ఉదయం గొడుగల్లు గ్రామానికి చెందిన విద్యార్థులు ఆటోలో కోసిగిలోని ఉన్నత పాఠశాలకు బయలుదేరారు. రోడ్డుపైనున్న గుంతల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో డ్రైవర్ గుర్తించలేక పోయాడు. దీంతో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. దీంతో ముగ్గురు విద్యార్థులు కింద పడి స్వల్పగాయాలతో బయటపడ్డారు.

బైక్ అదుపు తప్పి..

మండల కేంద్రానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి రంగప్పగట్టు సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కింద పడి హెచ్ఎంకు గాయాలు..

మంత్రాలయం రూరల్: సూగూరు గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.గురుస్వామి గోడలకు క్యూరింగ్ చేస్తూ కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పాఠశాలలో నాడు-నేడు పనుల కింద గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. గోడలను క్యూరింగ్ చేసే క్రమంలో కిందపడి గాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

కౌతాళం: అర్హులందరికీ ఇళ్ల స్థలాలను చూపుతామని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టాతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డుల జిరాక్స్‌లను అందజేస్తే స్థలం కేటాయిస్తామని చెప్పారు.

ధ్రువ పత్రాల పంపిణీ

పెద్దకడబూరు : స్థానిక సచివాలయం - 1లో సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి హాజరై 360 ధ్రువ పత్రాలు అందజేశారు.

కోసిగి: మండలంలోని చింతకుంట గ్రామంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, పెద్దభూంపల్లి గ్రామంలో తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించగా ఎంపీపీ ఈరన్న, నాడుగేని నరసింహులు, మాణిక్య రాజు, బుల్లి నరసింహులు,నాడుగేని నాగరాజు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుల నియామకం

ఆదోని సెంట్రల్: స్థానిక ఆర్అర్ లేబర్ కాలనీలోనున్న పురపాలక ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించారు. ఈనెల 15న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ పాఠశాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారని ప్రశ్నించినపుడు నలుగురు మాత్రమే ఉన్నట్లు తెలిసి డీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 920 మంది విద్యార్థులు ఉన్నచోట నలుగురు ఉపాధ్యాయులు ఉండడం ఏంటని ప్రశ్నించారు. పని సర్దుబాటులో భాగంగా 9 మంది ఉపాధ్యాయులను నియమించారు.

బీఎల్‌ఓలు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ఆదోని రూరల్ : బీఎల్‌ఓలు బాధ్యతయుతంగా ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సరిచూడాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు. శనివారం పట్టణంలోని ఇందిరానగర్‌లో ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాను పరిశీలించారు. 17వ వార్డులో 700 ఓట్లు ఉన్నాయని, అయితే వార్డు నంబరుకు బదులు ఇంటి నంబర్‌గా ముద్రితమైందన్నారు.

మందుల దుకాణాల తనిఖీ

పెద్దకడబూరు: నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా తనిఖీ బృందం కే.సంధ్యారాణి, ఎన్.రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక పురుగు మందుల దుకాణాలను శనివారం తనిఖీ చేశారు.

45వేల పాఠ్యపుస్తకాలు మంజూరు

కోసిగి: మండలంలోని 48 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 45 వేల సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ-2 నాగేశప్ప తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం లోపు అన్ని పాఠశాలలకు చేరవేస్తామన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం గ్రామ ఉన్నత పాఠశాలలో వైస్ ఎంపీపీ ఆధ్వర్యంలో గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డన్న, రాముడు, బ్రహ్మయ్య శనివారం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఆదివారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి జన్మదినం సందర్భంగా పుస్తకాలు అందజేశామన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు.

నాటుసారా స్వాధీనం

ఆదోని రూరల్ : మండలంలోని ఇస్వీ గ్రామ పరిసరాల్లో జమ్ము ఈరన్న పొలం వద్ద శనివారం 70 లీటర్ల నాటు సారా, స్కూటీని స్వాధీనం చేసుకున్నామని ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదోని పట్టణంలోని వాల్మీకి నగర్‌కు చెందిన బోయ మద్దిలేటి, బోయ మల్లికార్జున పోలీసులను చూసి నాటుసారా, స్కూటీని వదిలేసి పారిపోయారని, కేసు నమోదు చేసి వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దకడబూరు : మండల పరిధిలోని జాలవాడి గ్రామ శివారులో పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రూ.4,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ శనివారం తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడిచేసి యోహాన్, నర్సన్న, బజారప్ప, నర్సప్ప, రామన్నను అరెస్టు చేశారు.

































